


# పదిహేను పైసలకి ఆరుగురు పిల్లలు

**మా**కు యాజలి జీవితం ఒక రకం. అక్కడ తాతయ్యకి అమ్మ ఒక్కర్తే. అమ్మకు మేమిద్దరం ఇస్తాకూ, పొడీ అన్నట్లు.

గుంటూరులో మా నాన్నగారికి ముగ్గురు తమ్ముళ్ళు, ఇద్దరు చెల్లెళ్ళు, నాన్నే పెద్ద. వీళ్ళందరి పిల్లలూ కలిసి చాలామందిమి. ఇది మా తాతయ్యగారి కుటుంబం. ఆ తాతయ్యగారు నలుగురన్నదమ్ములు. నలుగురిళ్లూ వరసన ఉంటాయి. వాళ్ళందరి పిల్లలూ, వాళ్ళ పిల్లలూ అందర్నీ కలిపితే సినిమా విడుదలైన రోజున సెకండ్ షోకి ఉన్నంతమంది ఉంటారు.

అంతమంది పిల్లలూ ఉన్నా ఎవరిపని వాళ్ళకుండేది. ఒక్క క్షణం తీరికుండేది కాదు మాకు. మా ఇల్లు మెయిన్‌రోడ్డు మీద ఉండటం మా ప్రాణానికి వచ్చింది.

మా పెద్దవాళ్ళు తెల్లవారడం ఆలస్యం–మమ్మల్ని రోడ్డుమీదికి తోలేవాళ్ళు. దేవుడి పూజకు పూలు, రెక్సోనా సబ్బు, తిలకం సీసా, న్యూసుపేపరు, ఇలా ఏదో ఒకదాని కోసం తిప్పినవాళ్ళు తిప్పినట్లే ఉండేవాళ్ళు. మేము తిరిగినవాళ్ళం తిరిగినట్లే

ఉండేవాళ్ళం. ఈ బజారు తిరుగుళ్ళన్నీ ఒక ఎత్తు అయితే 'శంకర్ విలాస్'కి వెళ్ళి రావడం ఒక్కటీ ఒక ఎత్తు.

పోనీ అందరూ కలిసి ఐకమత్యంగా ఒకేసారి టిఫెను తెప్పించుకుంటారా అంటే అట్లాగా చెయ్యరు. వద్దులే అని ఊరుకోనూ ఊరుకోరు. ఒక్కళ్ళకి తెల్లారుతూనే ఇడ్లీ కావాలి. ఇంకొకళ్ళకి ఎండెక్కాక అట్టు కావాలి.

మాకు మాత్రం పెందలాడే అంత గిన్నెడు అన్నం వండి ఒకే కంచంలో కుంభంలా కలిపేసి ఏనుగు తలకాయంత ముద్దలు చేసి పెట్టేస్తే వాళ్ళ పనయిపోతుంది. ఇక మళ్ళీ మధ్యాన్నం అన్నాలదాకా పస్లు చేసి పెడతాం.

చెప్పాలంటే 'శంకర్ విలాస్' హోటల్‌కీ మా ఇంటికీ రోడ్డే అడ్డం. వాహనాలు రాకుండా చూసుకుని రోడ్డు దాటిస్తే హోటలుకి వెళ్ళిపోతాం, కానీ హోటలుకి వెళ్ళడం మా చెడ్డ చిరాకు. పొద్దునపూట రద్దీగా ఉంటుంది. మనం వెళ్ళగానే వాకిట్లో బల్ల దగ్గర కూర్చున్నాయన 'ఏం కావాలి' అనడుగుతాడు.

'ఒక మినపట్టు' అని చెప్తే డబ్బులు తీసుకుని చీటీ రాసి ఓ కుర్రాడిని పిల్చి 'ఒక మినపట్టు' అని చెప్తాడు.

అప్పుడా కుర్రాడు 'ఒక అట్టు పార్సీ' అని అరుస్తాడు –ఇవతలవాడు గుండాగి చచ్చేట్లు. ఆ కుర్రాడెంత గట్టిగా అరిచి చెప్పినా ఆ అట్టు తీరిగ్గా ఎప్పుడో దానిష్టం వచ్చినప్పుడు వస్తుంది. అంతదాకా హోటలు వాకిట్లోపడి ఏడవాలి.

ఎవరో తెలిసినవాళ్ళు కనపడి 'టిఫెనుకి వచ్చావా?' అని అడుగుతారు. హోటలుకి టిఫెనుకి కాకపోతే పేరంటానికొస్తారా ఎవరైనా? బయటికి వచ్చి నిలబడితే 'ధర్మం తల్లా! పుణ్యం వస్తుంది తల్లే' అంటూ ముష్టివాళ్ళు పీక్కుతింటారు.

'మాకు పుణ్యం వద్దు తల్లే, అట్టు వస్తే చాలు తల్లే' అని అరవాలనిపిస్తుంది.

ఇంతా అవస్థపడి అట్టు తీసికెళ్ళి ఇంట్లో ఇచ్చేసి 'అమ్మయ్య' అనుకునేసరికి మరొకరు సిద్ధం.

'హోటలుకి వెళ్ళి ఓ ప్లేటు ఇడ్లీ తెచ్చిపెడతావా అమ్మా, మా తల్లి, మా అమ్మ' అంటూ బతిమాలితే కాదని ఎలా అంటాం? మళ్ళీ ప్రయాణం.

"ఎందుకిన్నిసార్లు తిరుగుతారు? అన్నీ ఒకేసారి తీసికెళ్ళచ్చుగా" అంటాడా హోటలాయన.

"బాగానే ఉంది. మాకు లేని బాధ మీకెందుకు? కావలిస్తే అట్టుకోసారీ పచ్చడికోసారీ కూడా తిరుగుతాం" అంటాం. మన గుట్టు బయట పెట్టుకోకూడదుగా!

ఆయన్ని చూస్తే మాకూ చిరాకు, మమ్మల్ని చూస్తే ఆయనకీ చిరాకు. దానికితోడు డబ్బుల సమస్య ఒకటి.

అణాలూ బేడాలూ పోయి పైసలు వచ్చేసాయి. బేడకి పన్నెండు పైసలుట. మా పెద్దవాళ్ళకేమో సమయానికి రెండు పైసల నాణెం దొరక్క పదిపైసలిచ్చి పరవాలేదులే అని పంపిస్తారు.

వాళ్ళకి పరవాలేదుగానీ హోటలాయనకి బోలెడంత పరవా ఉంది. ముందు నాలుగు రోజులు ఇచ్చి ఆ తర్వాత కచ్చితంగా పన్నెండు పైసలూ ఇస్తేగానీ టిఫెను ఇవ్వనని చెప్పేశాడు. చిల్లర శ్రీమహాలక్ష్మిట.

ఏం చెయ్యను. అదృష్టవశాత్తూ ఆవేళ నాతో మా చెల్లెలు కూడా ఉంది. ఇద్దరం వెనక్కి వచ్చేద్దాం అనుకుంటూ ఉండగానే బల్ల దగ్గర మా ఇంకో చెల్లెలు కనిపించింది. 'ఇక్కడున్నావేమిటే' అని అడిగితే-

"నన్నూ అన్నయ్య తీచుకొచ్చాలు. లెందు పైచలు తక్కువత. నన్నిక్కలే కూచో మన్నాడు. ఇంటికెల్లాడు" అని చెప్పింది.

"అవును. చిల్లర తెచ్చి మీ చెల్లెల్ని తీసికెళ్ళమని నేనే పంపించాను" అన్నాడు హోటలాయన.

"అయితే ఇకనేం దీన్ని ఉంచుకోండి. నేవెళ్ళి డబ్బులు తీసుకొస్తా" అని ఇడ్లీలు పట్టుకువెళ్ళాను.

వెళ్ళగానే మరోపని. 'అమ్మడూ అర్ధణా హారతి కర్పూరం తెచ్చిపెట్టవే' అంటూ. సరే అని అటు వెళ్ళిపోయాను. ఆ తర్వాత ఆ విషయమే మర్చిపోయా.

కొంచెంసేపయ్యాక' అన్నాలకి రండి' అంటూ పిలిచారు. వెళ్ళాం. అప్పుడు లెక్కచూస్తే ఆరుగురు తగ్గేరు. అందరూ అయిదేళ్ళలోపు వాళ్ళే.

'ఏవైపోయారు ఏవైపోయారు' అంటుంటే అప్పుడు గుర్తుకొచ్చింది- హోటల్లో వదిలేసి వచ్చిన మా చెల్లాయి సంగతి. మిగిలినవాళ్ళూ కంగారుగా లేచారు- 'మేమూ వదిలేసి వచ్చాం. మేము వదిలేసి మర్చిపోయాం...' అంటూ.

వాళ్ళ అమ్మలు లబోదిబోమనడం మొదలుపెట్టారు. ఇక అప్పుడు వాళ్ళని రెండు పైసలు ఏం అడుగుతాం?

ఫ్లాకిట్లోకి పరిగెట్టి తాతయ్యగారి దగ్గర ఆగి విషయం చెప్పాం. ఆయన తలో మొట్టికాయా వేసి పావలా ఇచ్చారు– ఏకంగా అందర్నీ విడిపించుకురమ్మని.

హోటలుకి వెళ్ళాం. ఏడ్రాసి మొహాలు వేసుకుని కూర్చున్నారు ఆరుగురూనూ. అయిదుగురికి రెండు పైసల చొప్పున పదిపైసలు, ఒక తమ్ముడికి అయిదు పైసలు ఇవ్వాలిట (వాళ్ళు పదిహేను పైసల పూరీకి పదిపైసలే ఇచ్చారుట.) మొత్తం పదిహేను పైసలూ ఇచ్చి ఆరుగురినీ విడిపించుకొచ్చేశాం.

"ఒకరోజు ఇట్లాచేస్తే రెండోరోజు కచ్చితంగా చిల్లర పట్టుకొస్తారు" అన్నాడు హోటలాయన.

* * *